


# మస్తు మజా..



## మంగినపూడి సముద్రతీరంలో పోటెత్తిన జనం

- మసులా బీచ్ ఫెస్టివల్ చివరి రోజూ లక్షలాదిగా రాక
- పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్‌లతో సందడి
- అలలపై కనులవిందు చేసిన కెనోయింగ్, కయాకింగ్ క్రీడలు
- ఆకట్టుకున్న బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ, బీచ్ ఫుట్‌బాల్
- నవ్వులు పూయించిన జబర్దస్త్ బృందం
- యువతలో జోష్ నింపిన సినీ గాయకులు

మచిలీపట్నంలోని మంగినపూడి తీరానికి ఆదివారం జనం పోటెత్తారు. మసులా బీచ్ ఫెస్టివల్ ఆఖరి రోజు అదిరిపోయింది. పారాగ్లైడింగ్, స్పీడ్ బోటింగ్, హెలీరైడ్‌లతో పర్యాటకులు సందడి చేశారు. సముద్ర స్నానాలతో పులకరించారు. ఎగసి పడుతున్న అలలపై కెనోయింగ్, కయాకింగ్ పోటీలు కనుల విందుగా సాగాయి. బీచ్ వాలీబాల్, బీచ్ కబడ్డీ, బీచ్ ఫుట్‌బాల్ పోరు హోరాహోరీగా ముగిసింది. నవ్వులు పూయించిన బుల్లి తెర నటులు. సినీ గాయకులు తమ గానంతో అబ్బురపరిచారు. బందరు సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏర్పాటు చేసిన బీచ్ ఫెస్టివల్ పర్యాటకులకు మస్తు మజాని ఇచ్చింది.

- మచిలీపట్నం టౌన్/ అవనిగడ్డ/కృత్తివెన్ను, ఆంధ్రజ్యోతి

సాంస్కృతిక ప్రదర్శనలను తిలకిస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

# తలుపు తట్టిన రేషన్

## ఉమ్మడి కృష్ణాలో ఇంటికే నిత్యావసరాలకు 1,23,358 మంది కార్డుదారుల ఎంపిక

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కార్డుదారుల ఇంటికే రేషన్ తీసుకువెళ్లే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1,23,358 మందిని ఎంపిక చేసింది. ఇప్పటికే జూన్ నెల కోటాను 90 వేల మందికి డోర్ డెలివరీ చేసింది. ఇంటికే రేషన్ అంటే ఇదేనంటూ పలువురు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరును ప్రశంసిస్తున్నారు.

- లేవలేని, కదలలేని, నడవలేని స్థితిలో ఉన్నవారికి ప్రాధాన్యం
- ఇప్పటికే 90 వేల మందికి డోర్ డెలివరీ విధానంలో నిత్యావసరాల పంపిణీ
- నిజమైన డోర్ డెలివరీ ఇదేనంటున్న లబ్ధిదారులు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** నడవలేని, లేవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటికే రేషన్ బియ్యం అందించే మహత్తర కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 1,23,358 మంది 'ఇంటి వద్దకే రేషన్'కు ఎంపికయ్యారు. వీరిలో ఎన్టీఆర్ జిల్లాలో 57,469 మంది, కృష్ణా జిల్లాలో 65,889 మంది ఉన్నారు. జూన్ నెల కోటాను రేషన్ డిపో డీలర్లు వీరి ఇంటికే బియ్యం, పంచదార, కందిపప్పు తదితర నిత్యావసరాలను తీసుకువెళ్లి మరీ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు కూడా భాగస్వాములవుతున్నారు. మంచం మీద ఉన్న వ్యక్తి బయోమెట్రిక్ తీసుకుని సచివాలయ సిబ్బంది సమక్షంలో ఈ పోస్‌లో నిత్యావసరాల వివరాలు నమోదు చేసి, నిత్యావసరాలను తూకం వేసి ఇస్తున్నారు.


నగరంలో ఓ ఇంట్లో లేవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలి వేలిముద్ర తీసుకుని రేషన్ ఇస్తున్న డీలర్

### ఇప్పటికే 90 వేల మందికి అందజేత

ఉమ్మడి కృష్ణాజిల్లాలో దాదాపు 90 వేల మందికి నిత్యావసరాల పంపిణీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా, ఏ.కొండూరు మండలంలో 1,950 కార్డుదారులు, చందర్లపాడులో 3,018 మంది, గంపలగూడెంలో మిగతా 6లో..

### నాడు రోడ్డు చివరనే ఎండీయూ వాహనాలు

గత వైసీపీ ప్రభుత్వం డోర్ డెలివరీ అని చెప్పినా ఎండీయూ వాహనాలు ఎప్పుడూ కార్డుదారుల ఇళ్ల వద్దకు వెళ్లలేదు. ఒక రోడ్డులో ఒక చోట ఆపితే ఇళ్ల నుంచి బయటకు వచ్చిన లబ్ధిదారులు ఎండీయూ వాహనం వద్ద పడిగాపులు పడి నిత్యావసరాలను తీసుకునే వారు. దీనికి చెక్ పెడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రస్తుతం రేషన్ డీలర్, సచివాలయ సిబ్బంది నిత్యావసరాలతో లేవలేని, నడవలేని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారి ఇంటికే నేరుగా వెళ్లి అందజేస్తున్నారు.

# డీఈవో కార్యాలయం ముట్టడి

## మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్ జరపాలని డిమాండ్

## ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌తో నష్టపోతున్నామని ఆవేదన

**మచిలీపట్నం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి):** టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా జరపాలని కోరుతూ ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. గతంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తొలుత ధర్నా వేదిక వద్ద నుంచి ప్రదర్శనగా డీఈవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు సుబ్రహ్మణ్యం, లెనిన్, కొమ్ము ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో 4,200 మంది సెకండరీ టీచర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తే ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ మాన్యువల్‌గా జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకుడు బి.లంకేశ్, యూటీఎఫ్ నాయకులు బి.కనకరావు, షౌకత్, సుందరయ్య, కె.ఎ.ఉమామహేశ్వరరావు, ఎస్.పి.మనోహర్, ఎస్టీయూ నాయకులు చంద్రశేఖర్, పి.ఇమ్మానియేలు, ఏపీటీఎఫ్ 257 సంఘం నాయకులు ఏ.సుబ్రహ్మణ్యం, సాంబ శివరావు, రాధిక, ఎస్.ఖాసీమ్, ఈ.వి.రామారావు, ఏపీటీఎఫ్ 1938 సంఘ నాయకులు కె.శేషగిరి, తమ్ము నాగరాజు, ఏపీపీటీఏ నాయకులు ఏ.ఆర్.అస్లాం, సదారత్, పీఆర్‌టీయూ నాయకులు పి.శ్రీనివాసరావు, డీపీఆర్‌టీయూ నాయకులు ఎస్.రాంబాబు, జి.పెరుమాళ్లు, బీటీఏ నాయకుడు టి.సూరిబాబు, ఎంటీయూ నాయకుడు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.


డీఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు



మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం యోగాసనాలు వేస్తున్న సీనియర్ సిటిజన్స్

### జగన్ పత్రిక ప్రతుల దహనం


రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ మాట్లాడిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావును తక్షణం అరెస్టు చేయాలని, డిబేట్ నిర్వహించిన జగన్ మీడియాపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆందోళనలు జరిగాయి. జగన్ పత్రిక ప్రతులను అవనిగడ్డలో టీడీపీ నాయకులు, మహిళా నేతలు దహనం చేశారు.

# ఇక అమ్మ సేవ

## దుర్గగుడిలో ప్రత్యేకంగా సేవా విభాగం ఏర్పాటు



- రోజుకు 200 మంది సేవకులకు అవకాశం
- సేవలో ఇక సమూల మార్పులు
- అంతరాలయం వద్ద సెక్యూరిటీ స్థానంలో సేవకులకు ఛాన్స్

**(ఆంధ్రజ్యోతి - విజయవాడ):** శ్రీవారి సేవ... తిరుమలలో సేవ చేయాలనుకున్న వారికి వేదిక ఇది. దీని తరహాలోనే దుర్గమ్మ సేవకు ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. శ్రీవారి సేవ మాదిరిగానే శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారి సేవకు సంబంధించి కొత్తగా సేవా విభాగాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. అన్ని విభాగాల మాదిరిగానే ఈ సేవా విభాగం శాశ్వతంగా పనిచేస్తుంది. దీనికి ఒక ఏఈవో, ఒక సూపరింటెండెంట్, ఒక గుమస్తాను కేటాయించారు. ప్రస్తుతం సేవకులకు సంబంధించి ప్రత్యేక విభాగమేమీ లేదు. సేవకుల పేర్లను రిజిస్టర్ చేసుకునే విధులను ఇతర విభాగాల్లో ఉన్న సిబ్బందికి అప్పగించేవారు. ఇక నుంచి ఆ విధంగా కాకుండా అమ్మ సన్నిధిలో సేవ చేయాలనుకున్న వారి కోసం ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేయాలని ఇటీవల సీఎం నిర్వహించిన సమావేశాల్లో స్పష్టం చేశారు. దీనితోపాటు ఐవీఆర్ఎస్‌లో భక్తుల నుంచి వ్యక్తమవుతున్న అభిప్రాయాలను క్రోడీకరించి ఈ నిర్ణయం తీసుకున్నారు. అమ్మవారి సేవకు వచ్చిన సేవకులకు వన్‌టౌన్‌లో ఉన్న సీవీరెడ్డి సత్రంలో మిగతా 6లో..

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులను ఇంద్రకీలాద్రి మీదకు తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా బస్సులను దేవస్థానం నడుపుతోంది. రైల్వేస్టేషన్ నుంచి ఒక బస్సు, పీఎన్‌బీఎస్ నుంచి మరో బస్సు, దుర్గాఘాట్ నుంచి ఒక బస్సు ఇంద్రకీలాద్రి పైకి భక్తులను చేర్చుతున్నాయి. దుర్గాఘాట్ వద్ద కృష్ణానదిలో

### బస్టాప్‌ల వద్ద

స్నానాలు చేసిన తర్వాత ఇక్కడే భక్తులు బస్సు ఎక్కుతారు. దుర్గాఘాట్‌తో పాటు రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్ వద్ద బస్సు ఎక్కేటప్పుడు భక్తులు ఒకరినొకరు తోసుకుంటూ ఎక్కుతున్నారు. ఈ తోపులాటలో చిన్నపిల్లలు నలిగిపోతున్నారు. ఇక ఈ పరిస్థితికి ఫుల్‌స్టాప్ పెట్టాలని భావించారు. ఈ మూడు పాయింట్లలో సేవకులను నియమిస్తారు. వారు భక్తులను ఒక క్యూలో నిలబెట్టి ఒకరి తర్వాత మరొకరిని బస్సు ఎక్కిస్తారు. దీనివల్ల ఎలాంటి తోపులాటలు ఉండవన్నది అధికారుల భావన.

### నిత్యం 200 మందికి అవకాశం

దుర్గగుడితో పాటు దానికి అనుబంధంగా ఉన్న అన్ని ప్రదేశాల్లో సేవకులను ఉపయోగించబోతున్నారు. రోజుకు 200 మంది సేవలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమలలో శ్రీవారి సేవ చేయడానికి దేశ వ్యాప్తంగా భక్త బృందాలు ఉంటాయి. సేవకు వెళ్లాలనుకున్న భక్తులు అయినా, భజన బృందాలు అయినా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. ఖాళీ ఉన్న తేదీలను చూసుకుని బుక్ చేసుకోవాలి. అక్కడికి వెళ్లిన తర్వాత శ్రీవారి సేవా విభాగం వారికి సేవలు చేయాల్సిన ప్రదేశాలను కేటాయిస్తుంది. దుర్గగుడిలోను ఇక నుంచి ఆ విధంగా చేయబోతున్నారు. అమ్మవారికి సేవ చేయాలనుకున్న వారి రిజిస్ట్రేషన్లను ప్రస్తుతం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చేస్తున్నారు.

### ఈఏపీసెట్‌లో ఉమ్మడి కృష్ణా సత్తా

- ఫార్మసీలో కానూరు విద్యార్థికి రాష్ట్ర ప్రథమ ర్యాంకు
- 400లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు


ఆర్.వి.ఎస్.ఎన్.హర్షవర్ధన్

6

### శివగంగలో అంకినీడు అంత్యక్రియలు



# జన సంద్రం



- మసులా ఫెస్ట్ -2025 సూపర్ హిట్
- ముగిసిన బీచ్ ఫెస్టివల్.. లక్షల్లో వీక్షకులు
- విశేషంగా ఆకట్టుకున్న సీ కయాకింగ్, బీచ్ కబడ్డీ
- పర్యాటకులను ఓలలాడించిన సినీ, సంగీత విభావరి
- చివరి రోజు ట్రాఫిక్ ఇబ్బందులు



బీచ్ ఫెస్టివల్ విజయవంతం సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తున్న కూటమి నేతలు

**మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ, కృత్తివెన్ను జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** కృష్ణా జిల్లా మంగినపూడిలో నాలుగురోజుల పాటు సాగిన మసులా బీచ్ ఫెస్టివల్ జిల్లా చరిత్రలోనే అతిపెద్ద పర్యాటక ఈవెంట్‌గా నిలిచింది. బీచ్ ఫెస్టివల్‌ను తిలకించేందుకు కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. అధికారిక లెక్కల ప్రకారం తొలి మూడు రోజుల్లోనే 5 లక్షల మందికిపైగా ఫెస్టివల్‌లో పాల్గొన్నారని అంచనా.. చివరి రోజైన ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. బీచ్ ఫెస్టివల్‌కు విశేష ఆదరణ లభించటంతో పర్యాటక శాఖలో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి.







### విశేషంగా ఆకట్టుకున్న సీ కయాకింగ్

ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే తొలిసారిగా బీచ్ ఫెస్టివల్‌లో ప్రవేశపెట్టిన సీ కయాకింగ్ పోటీలు వీక్షించేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరిచారు. ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో రెండుసార్లు మాత్రమే ఈ పోటీలు నిర్వహించగా, మూడో సారి మంగినపూడి బీచ్‌లో జరిగాయి. ఇప్పటికే జలక్రీడల అకాడమీ ద్వారా కయాకింగ్, కెనోయింగ్, డ్రాగన్ బోట్ రేసింగ్, కయాయిన్ సాలోమ్, కనో షో వంటి క్రీడల్లో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరుస్తుండగా, తొలిసారిగా జలక్రీడలకు మరింత ఊతాన్ని ఇవ్వగలవని భావిస్తున్నారు. జలక్రీడల్లో భాగంగా సబ్ జూనియర్, సీనియర్, మిక్స్‌డ్ మాస్టర్స్ విభాగాల్లో పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు మచిలీపట్నం తరలివచ్చారు. కయాకింగ్ పోటీల్లో 17 రాష్ట్రాల క్రీడాకారులు పోటీ పడగా, రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చి ఫైనల్స్‌కు చేరుకున్నారు. 500 మీటర్ల విభాగంలో 12 మంది ఫైనల్స్‌కు చేరుకోగా, ఇద్దరు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ఉన్నారు. 500 మాస్టర్స్ విభాగంలో ముగ్గురు, అండర్-18 విభాగంలో ఏడుగురు రాష్ట్ర క్రీడాకారులు ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఆదివారం జరిగిన పోటీలు ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించాయి.



మంగినపూడి బీచ్‌లో కళా వేదికపై హాస్యం పండిస్తున్న జబర్దస్త్ నటులు



యాంకర్ మృదుల అయ్యంగార్, రామ్ మిరియాల..



బోట్ రైడింగ్‌లో క్రీడాకారులు

### మంత్రముగ్ధుల్ని చేసిన సంగీత విభావరి

మంగినపూడి బీచ్‌లో సినీ సంగీత విభావరి ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, జబర్దస్త్ టీమ్ హాస్యగుళికలు, సంగీత విభావరి కార్యక్రమాలను పర్యాటకులు ఆస్వాదించారు. నాలుగు రోజులపాటు జరిగిన బీచ్ ఫెస్టివల్‌కు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చారు.

### ఫెస్టివల్‌కు 10 లక్షల మంది : కలెక్టర్ బాలజీ

మసులా బీచ్ ఫెస్టివల్స్‌కు నాలుగు రోజుల్లో 10 లక్షల మందికి పైగా పర్యాటకులు సందర్శించినట్టు కృష్ణా కలెక్టర్ బాలజీ పేర్కొన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ, బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతమైనట్టు చెప్పారు. యాత్రికులు, పర్యాటకులను క్షేమంగా ఇంటికి చేర్చేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. వారికి ఈ ఫెస్టివల్ తీపి గుర్తుగా ముద్ర వేస్తుందన్నారు.






కయకింగ్ విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో మంత్రి రవీంద్ర తదితరులు



జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

## జగన్ పత్రిక ప్రతుల దహనం

**మచిలీపట్నం టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** మహిళలను కించపరుస్తూ అమరావతి రాజధాని పట్ల, రాజధాని ప్రాంతంలో ఉన్న మహిళల పట్ల తీవ్ర వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస రావులను తక్షణం అరెస్టు చేయాలని, జగన్ మీడియా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత డిమాండ్ చేశారు. ఆదివారం మచిలీపట్నంలోని జిల్లా టీడీపీ కార్యాలయం వద్ద జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, జగన్ మీడియా ప్రతినిధులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగన్ మీడియా యాజమాన్యం భారతిరెడ్డి, జగన్‌రెడ్డిలు రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, రాష్ట్ర నాయకురాలు యార్లగడ్డ సుచిత్ర, తెలుగు మహిళలు లంకిశెట్టి నీరజ, మల్లంపాటి విజయలక్ష్మి, మేడసాని రత్నకుమారి, పాలపర్తి పద్మజ, వసంతకుమారి, త్రిపుర తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఐటీఐలో జనరల్ పూల్ కౌన్సెలింగ్

**భారతీనగర్ :** 2025-26 విద్యాసంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో అడ్మిషన్ల కొరకు ఈనెల 5, 6 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సిలింగ్‌లో సీటురాని అభ్యర్థులు సోమవారం నిర్వహించే జనరల్ పూల్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం వరకు నిర్వహించబడుతుందన్నారు. సీటు రాని అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, కులధ్రువీకరణ, ఈడబ్ల్యూఎస్, ఆధార్, స్టడీసర్టిఫికెట్ ఒరిజినల్స్ హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ పొందిన అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులు మినహా ఇతర కేటగిరీల అభ్యర్థులు రూ.60 డిపాజిట్ చెల్లించాలని, ప్రైవేట్ ఐటీఐలో చేరే అభ్యర్థులు నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## క్రీడాభివృద్ధికి ఏసీఏ కృషి

- ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్

**విజయవాడ స్పోర్ట్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** క్రీడాభివృద్ధికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కృషి చేస్తోందని అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ 72వ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం ఎంపీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఉమెన్ వరల్డ్ కప్‌లో ఐదు మ్యాచ్‌లు విశాఖపట్నంలో జరుగుతాయని, అక్కడి స్టేడియంలో 45 రోజుల్లో జరిగిన అభివృద్ధిని చూసి బీసీసీఐ, ఐసీసీ చైర్మన్ జైషా సంతృప్తి వ్యక్తం చేశారని, ఇకపై మ్యాచ్‌లను కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇటీవల జరిగిన ఐపీఎల్ రెండు మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంలోనే వరల్డ్ కప్ మ్యాచ్‌లతో పాటు ఒక వన్‌డే మ్యాచ్ నిర్వహణకు విశాఖ వేదిక కానుందని చెప్పారు. రాష్ట్రంలోని 25 జిల్లాల్లో క్రికెట్ గ్రౌండ్‌లను నిర్మించడానికి నిర్ణయించామని, మొదట కర్నూలు, నెల్లూరులో నిర్మిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎంతోమంది క్రీడాకారులను తయారుచేయడంతో పాటు వారికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఏసీఏ కృషి చేస్తుందన్నారు. ఇకపై అన్ని జిల్లాల్లోని అసోసియేషన్లు, క్లబ్‌ల ఆధ్వర్యంలో సంవత్సరంలో 200 రోజులు క్రికెట్ పోటీలు జరిగేలా ప్రణాళిక రూపొందించేందుకు నిర్ణయించినట్టు తెలిపారు.

## ఈఏపీసెట్‌లో ఉమ్మడి కృష్ణా సత్తా

- ఫార్మసీలో కానూరు విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్

**విజయవాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** ఈఏపీసెట్ ఫలితాల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. 500లోపు ర్యాంకులు సాధించి నిర్ధేశించుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేయడానికి సిద్ధమవుతున్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు గ్రామానికి చెందిన రామాయణం వెంకట నాగసాయి హర్షవర్థన్ ఫార్మసీలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఇంజనీరింగ్‌కు కృష్ణాజిల్లా నుంచి మొత్తం 5068 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 4890 మంది ప్రవేశ పరీక్ష రాశారు. వారిలో 3395 మంది ర్యాంకులు సాధించారు.

ఎన్టీఆర్ జిల్లా నుంచి 37,749 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 35,325 మంది పరీక్ష రాశారు. వారిలో 25,943 మంది ర్యాంకులు సాధించారు. కృష్ణాజిల్లా నుంచి అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశపరీక్షకు 1159 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 1094 మంది పరీక్ష రాశారు. వారిలో 984 మందికి ర్యాంకులు వచ్చాయి. ఎన్టీఆర్ జిల్లా నుంచి 6802 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 6208 మంది పరీక్ష రాశారు. వారిలో 5701 మంది ర్యాంకులు సాధించారు.

### ఎంఐటీలో చదవాలన్నదే లక్ష్యం



- వడ్లమూడి లోకేష్ (50)

అమెరికాలోని ప్రముఖ ఎంఐటీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చేయాలన్నది లక్ష్యం. ఇందులో సీటుకోసం ప్రయత్నం చేస్తున్నాను. తెలంగాణ ఎంసెట్‌లోనూ 50వ ర్యాంకు వచ్చింది. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పదో ర్యాంకు వచ్చింది. ముంబై ఐఐటీలో సీటుకు హామీ ఇచ్చింది. నాన్న వెంకయ్య ఓ స్వచ్ఛంద సేవా సంస్థలో పనిచేస్తున్నారు. అమ్మ ఇంటి వద్దే ఉంటారు. అన్నయ్య బెంగళూరు ట్రిపుల్ ఐటీలో ఐదో సంవత్సరం చదవుతున్నాడు.

### కంప్యూటర్స్ లేదా ఎలక్ట్రానిక్స్ చేస్తా..



- ఆరుమూరు రామ్ వరప్రసాద్(328)

ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ లేదా ఎలక్ట్రానిక్స్ చేయాలన్నది లక్ష్యం. 328వ ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్న గురుమోహన్ ప్రసాద్ హౌసింగ్ బోర్డులో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఖరగ్‌పూర్‌లోని ట్రిపుల్ ఐటీలో ఎలక్ట్రానిక్స్ చేయాలనుకుంటున్నా. అది సాధ్యం కాకపోతే గాంధీనగర్‌లోని ట్రిటుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలనుకుంటున్నా.

### ఇంజనీర్‌గా దేశానికి సేవలందిస్తా..



- కనికిచర్ల జశ్వంత్ వెంకట రఘువీర్ (29)

తాతగారిని ఆదర్శంగా తీసుకుని దేశానికి సేవలందించాలనే లక్ష్యంతో ఇంజనీరింగ్ లక్ష్యాన్ని నిర్ధేశించుకున్నా. ప్రణాళికాబద్ధంగా చదవడం వల్ల 29వ ర్యాంక్ సాధించా. నాన్నగారు చిన్నపాటి వ్యాపారం చేస్తుంటారు. అన్న కాంచిపురం ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. తాతగారు వాతావరణ సైంటిస్ట్. అదే తరహాలో ఇంజనీరింగ్ పూర్తిచేసి భవిష్యత్‌లో దేశానికి సేవలందించాలని ఉంది. జిల్లాలో టాపర్‌గా నిలుస్తానని ఊహించలేదు. కంప్యూటర్ సైన్స్ చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్న పట్టుదల ఉంది. తల్లిదండ్రులు, తాతయ్య ప్రోత్సాహం టాపర్‌గా నిలిపాయి.

### తాతయ్య స్ఫూర్తితో..



- కాకర్ల నిఖిత, మొగల్రాజపురం (154)

నా ఉన్నతికి తాతయ్య స్ఫూర్తే కారణం. తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యులు. తాతయ్య వీటీపీఎస్‌లో చీఫ్ ఇంజనీర్‌గా రిటైరయ్యారు. నాపై తాతయ్య ప్రభావం ఉంది. సమాజంలో సేవచేసే అత్యుత్తమ అవకాశం డాక్టర్లకు ఉంటుందని ఆయన ఎప్పుడూ చెబుతుండేవారు. నేనూ మెడిసిన్ చేయాలని నిర్ణయించుకున్నాను.

### సివిల్స్ లక్ష్యం



- బుక్కసముద్రం గౌతం రెడ్డి, (315)

మా స్వస్థలం కడప జిల్లా. రైతు కుటుంబం. నా చదువుకోసం అమ్మనాన్న విజయవాడలో ఉంటున్నారు. నాన్న పొలానికి వెళ్లి పనులు చేసి వస్తుంటారు. సివిల్స్ నా లక్ష్యం. ముందుగా ఐఐటీలో సీటు సాధించిన తర్వాత సివిల్స్‌కు వెళ్తా. పేదలకు, సమాజానికి సేవ చేయాలని ఉంది.

### సాఫ్ట్‌వేర్ డెవలపర్ కావాలన్నది కల



- పబ్బతి చంద్రేష్, (79)

ఛాలెంజింగ్ సబ్జెక్ట్ అంటే ఇష్టం. సాఫ్ట్‌వేర్ డెవలపర్ కావాలన్నది నా కల. దీనికోసం పది నుంచి కష్టపడుతున్నాను. పదిలో 586 మార్కులు, ఇంటర్‌లో 978 మార్కులు సాధించాను. జేఈఈ అడ్వాన్స్‌లో 1076 ర్యాంకు సాధించాను. ఇప్పుడు ఈఏపీసెట్‌లో 79వ ర్యాంకు వచ్చింది. రోజుకు 14 గంటలు కష్టపడేవాడిని. కంప్యూటర్ సైన్స్ కోర్సు తీసుకోవాలన్నది నా కల.

### సాఫ్ట్‌వేర్ డెవలపర్ కావాలన్నది లక్ష్యం..



- సూదుల తేజ యశ్వంత్(228)

ఈఏపీసెట్‌లో నాకు 228 ర్యాంకు వచ్చింది. తెలంగాణాలో 29వ ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌లో నాకు 308వ ర్యాంకు వచ్చింది. బాంబే ఐఐటీలో చదవాలన్నది నా కల. అది నెరవేరుతున్నందుకు గర్వంగా ఉంది. కంప్యూటర్స్ సైన్స్ చదివి సాఫ్ట్‌వేర్ డెవలపర్ కావాలన్నది నా లక్ష్యం.

### శివగంగలో మాజీ ఎంపీ

## అంకినీడు ప్రసాద్ అంతిమ వీడ్కోలు

- నివాళులు అర్పించిన కలెక్టర్ బాలాజీ, జిల్లా ఎస్పీ గంగాధరరావు, ఎమ్మెల్యే మండలి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

**మచిలీపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** చల్లపల్లి రాజా తనయులు, బందరు మాజీ ఎంపీ యార్లగడ్డ అంకినీడుప్రసాద్ బహద్దూర్ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో మచిలీపట్నం శివగంగలో ఆదివారం సాయంత్రం జరిగాయి. చల్లపల్లిలో ప్రజల సందర్శన అనంతరం భౌతికకాయానికి శివగంగలోని జమిందారుల అతిథిగృహం నుంచి స్మశానవాటికకు అంతిమయాత్ర నిర్వహించారు. అంకినీడుప్రసాద్ కుమారులు రామేశ్వరప్రసాద్, హరీశ్వరప్రసాద్, కుమార్తెలు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు నివాళులు అర్పించారు. శివగంగలో చల్లపల్లి రాజ వంశీయులకు చెందిన స్మశానవాటికలో శాస్త్రోక్తంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించి మూడురౌండ్లు గాల్లో కాల్పులు జరిపిన అనంతరం కుమారులు చితికి నిప్పంటించారు. అంకినీడుప్రసాద్ భౌతికకాయానికి కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, కొనకళ్ల బుల్లయ్య, కొనకళ్ల కిరణ్ గణపతి, చైతన్య గణపతి, సజ్జా చలపతిరావు, యార్లగడ్డ శ్రీనివాసరావులతో పాటు పలువురు ప్రముఖులు తదితరులు నివాళులు అర్పించారు.



యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ పాడెను మోస్తున్న కొనకళ్ల నారాయణ, బుల్లయ్యలు

## ఇక అమ్మ సేవ

(5వ పేజీ తరువాయి)

బస కల్పిస్తారు. వారికి దుర్గగుడిలో భోజనం ఏర్పాటు చేస్తారు. సేవ చేయాల్సిన ప్రాంతాలకు వారిని దేవస్థాన వాహనాల్లో తీసుకెళ్లి వదులుతారు. తర్వాత అక్కడి నుంచి వాహనాల్లో తీసుకొచ్చి బస కేంద్రం వద్ద దింపుతారు. సేవ పూర్తయిన తర్వాత సేవకులకు అమ్మవారి దర్శనం చేయించి, ప్రసాదంతోపాటు సామూహిక వేద ఆశీర్వచనం ఇప్పిస్తారు. ప్రస్తుతం సేవకులతో సేవ మాత్రమే చేయిస్తున్నారు. ఈ విధానాన్ని త్వరలో మార్పు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

### అన్ని సేవలకు వినియోగించాలని..

ఈ సేవకులను ప్రస్తుతం అన్నదానం విభాగంలో, క్యూలైన్ల వద్ద ఉపయోగిస్తున్నారు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ నుంచి ఇంద్రకీలాద్రికి అనుసంధానంగా అన్ని ప్రదేశాల్లో సేవకులను వినియోగించుకోవడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతరాలయం ముందు, లోపల ప్రస్తుతం మహిళా సెక్యూరిటీగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. రద్దీ లేని సమయాల్లోను అమ్మవారిని ప్రశాంతంగా దర్శనం చేసుకోనివ్వడం లేదన్న ఆరోపణ వారిపై ఉంది. దీనితో అంతరాలయంతో పాటు ముఖద్వార దర్శనం, ఉచిత, రూ.100 క్యూలైన్ల వద్ద సెక్యూరిటీ గార్డులను తొలగించి ఆ స్థానంలో సేవకులకు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. ఇది కాకుండా అన్నదానం, క్యూలైన్ల ప్రవేశ మార్గం, ప్రసాదం కౌంటర్లు, సెల్‌ఫోన్ డిపాజిట్ పాయింట్లు, లగేజీలను భద్రపరిచే కౌంటర్, చెప్పుల స్టాండ్ వద్ద సేవకులను నియమించబోతున్నారు. కనకదుర్గానగర్‌లో వాహనాల పార్కింగ్ వద్ద నిత్యం సెక్యూరిటీ గార్డులకు భక్తులకు ఏదో ఒక విషయంలో వివాదాలు జరుగుతున్నాయి. సెక్యూరిటీ గార్డులకు సహాయకులుగా ఈ సేవకులను నియమిస్తారు. వాటితోపాటు ఆర్జిత సేవల వద్ద ఈ సేవకులను ఉపయోగించుకుంటారు.

## తలుపు తట్టిన రేషన్

(5వ పేజీ తరువాయి)

3,060 మంది, జీ.కొండూరులో 2,278 మంది, ఇబ్రహీంపట్నంలో 2,171 మంది, జగ్గయ్యపేటలో 3,175 మంది, కంచికచర్లలో 2,689 మంది, మైలవరంలో 2,651 మంది, నందిగామలో 3,218, పెనుగంచిప్రోలులో 2,259 మంది, రెడ్డిగూడెంలో 2,213 మంది, తిరువూరులో 2,679, వత్సవాయిలో 2,808, వీరులపాడులో 2,371, విజయవాడ ఏఎస్‌వో కార్యాలయం- 1 పరిధిలో 7,528 మంది, విజయవాడ అర్బన్ - 2 కార్యాలయం పరిధిలో 6,855 మంది, విజయవాడ అర్బన్ - 3 పరిధిలో 4,207 మంది, విస్సన్నపేట మండలంలో 2,399 మంది కార్డుదారులు లేవలేని, నడవలేని, కదలలేని స్థితిలో, దీర్ఘకాలిక వ్యాధులతో మంచం మీద ఉన్న ఉన్నారు. మొత్తంగా 57,469 మందిలో ఆదివారం నాటికి 42,114 మందికి రేషన్ డీలర్లు వారి ఇంటికే వెళ్లి నిత్యావసరాలను పంపిణీ చేశారు. కృష్ణాజిల్లా మొత్తం 65,889 మందిని డోర్ డెలివరీకి గుర్తించగా.. ఆదివారం నాటికి 48,751 మందికి డోర్ డెలివరీ పూర్తి చేశారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
| --- | --- |
| బ్రాయిలర్ బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 234 |
| చికెన్ స్కిన్‌లెస్ | 244 |

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

## విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న అనుమోలు వంశోధాయ్ ట్రస్టు ప్రతినిధులు

**కంకిపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** అనుమోలు వంశోధాయ్ ట్రస్టు ఆధ్వర్యంలో పునాదిపాడులోని కాకతీయ విద్యాట్రస్టు బాలురలకు ఉపకార వేతనాలను ట్రస్టు ప్రతినిధులు ఆదివారం పంపిణీ చేశారు. ట్రస్టులో చదువుతున్న 20 మంది విద్యార్థులకు రూ. 5 లక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కానూరు రామారావు, తాతినేని విద్యాసాగర్, అనుమోలు బాలాజీ ప్రసాద్, అనుమోలు హరిప్రసాద్, అనుమోలు రాజేష్, అనుమోలు గణేష్ ప్రసాద్, పిడికిటి సుగుణమూర్తి, అనుమోలు నవీన్, అనుమోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మురుగు కదలదు.. మునిసిపాలిటీకి పట్టదు!

- కానూరులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- డ్రెయిన్లలోనే చెత్తా చెదారం
- ముసురుతున్న ఈగలు, దోమలు...
- వెదజల్లుతున్న దుర్వాసన

**(కానూరు - ఆంధ్రజ్యోతి)**

తాడిగడప మున్సిపాలిటీ కానూరులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీలో చెత్తచెదారం, మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి పూడుకుపోయాయి. దీంతో మురుగు ముందుకు కదలక ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్వాసన కొడుతోంది. మెయిన్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ పొంగి బయటకు మురుగు నీరు వస్తోంది. ఈగలు, దోమలు పెరిగి దుర్వాసన మయంగా మారింది. అదేవిధంగా కానూరు ఎస్సీ కాలనీలో డ్రెయినేజీలో మట్టి పేరుకుపోవడం వల్ల మురుగు బయటకు వచ్చి రోడ్లపైకి పొంగి పొర్లుతోంది. ఇదే పరిస్థితి కానూరు అంతా కనిపిస్తోంది. దీనిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. డ్రెయినేజీల్లో పూడికను తీయాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాకాలం సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో రోగాలు బారినపడకుండా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.



కానూరులోని డ్రెయిన్లలో నిలిచిపోయిన మురుగు



కానూరు ఎస్సీ కాలనీలోని డ్రెయినేజీలో పేరుకుపోయిన మట్టిని చూపుతున్న స్థానికుడు

## ఏపీ ఈఏపీసెట్ బీఫార్మసీలో పెనమలూరు విద్యార్థికి రాష్ట్ర ప్రథమ ర్యాంకు

**పెనమలూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఫార్మసీ విభాగంలో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన రామాయణం వెంకట నాగసాయి హర్షవర్ధన్ పెనమలూరుకు చెందిన వాడే. అతని తండ్రి వెంకట నాగ సత్యనారాయణ హెచ్‌డీఎఫ్‌సీ సంస్థలో కమర్షియల్ వెహికిల్ విభాగంలో రాష్ట్ర హెడ్‌గా పనిచేస్తుండగా తల్లి హేమలలిత గృహిణి. నాగసత్యనారాయణ కుటుంబం ఉద్యోగ రీత్యా నంద్యాల నుంచి ఐదేళ్ల క్రితం పెనమలూరు మండలం కానూరు వచ్చారు. హర్షవర్ధన్ చిన్నప్పటి నుంచి చదువు పట్ల ఎంతో ఉత్సుకత చూపిస్తూ క్లాసులో మొదటి స్థానం సాధిస్తూ వచ్చాడని తల్లిదండ్రులు తెలిపారు. వేలివెన్ను శశి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన ఈ విద్యార్థి అక్కడే ఎంసెట్‌కు శిక్షణ కూడా తీసుకున్నట్లు తెలిపారు. చిన్నప్పటి నుంచి తాను డాక్టర్ కావాలని కలలు కనేవాడని తండ్రి తెలిపారు. నాగసాయి హర్షవర్ధన్ ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ, తాను మొదటి నుంచి ప్రణాళికా బద్ధంగా చదవడం, అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ ర్యాంకు సాధించానన్నారు. నీట్‌లో మంచి ర్యాంకు వస్తుందని ఆశిస్తున్నట్లు హర్షవర్ధన్ తెలిపాడు. రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన హర్షవర్ధన్‌ను కాలనీ వాసులు అభినందించారు.



## పంటకాల్వ పూడికతీత

**ఉయ్యూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** గండిగుంట పరిధి పురుగుల డొంక పంట కాల్వ పూడికతీత పనులు ఎట్టకేలకు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో పంటకాల్వ సంవత్సరాల తరబడి పూడికతీతకు నోచుకోకపోవడంతో పొలాలకు సాగు నీరందక, అధిక వర్షాలకు పొలాల్లో నీరు పోయేందుకు అవకాశం లేక రైతుల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కాల్వ కింద షుమారు 500 ఎకరాలకుపైగా పొలాలు సాగుచేస్తున్న పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కాల్వ పూడిక తీత పనులు ప్రారంభించారు. ఉయ్యూరు - కాటూరు రోడ్డులో కాకాని నగర్ సమీపం నుంచి పురుగుల డొంక వెంబడి ఉన్న ఈ కాల్వ దిగువ ప్రాంతంలో పొలాలకు సాగునీరందిస్తుంది. కాల్వ పూడిక తీతపనులు చేపట్టడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## వీరవల్లి విద్యార్థులకు షైనింగ్‌స్టార్స్ అవార్డులు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న షైనింగ్ స్టార్ పథకం ద్వారా అవార్డులకు గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఇచ్చే ఈ అవార్డుకు బాపులపాడు మండలం వీరవల్లి నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో రాంబాలాసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరవల్లికి చెందిన వాణీ విద్యానికేతన్ విద్యార్థులు గుత్తా సురేంద్ర, షేక్ మస్తాన్‌వలి, గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు సుంకర రాము, ఆర్నేపల్లి కనకసింహాచలం, చాట్ల సురేష్, ఇలపర్తి కోటేశ్వరరావులు షైనింగ్ స్టార్స్‌గా ఎంపికైనట్లు పేర్కొన్నారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ హాలులో సోమవారం జరిగే కార్యక్రమంలో వీరికి రూ.20వేలు నగదు పురస్కారం అందజేస్తారని తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలలకు మొండిచేయి**

జిల్లా వ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇచ్చే షైనింగ్ స్టార్ అవార్డులకు ఈసారి ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు అందలేదు. బాపులపాడు మండలంలో ఎంపికైన ఆరు అవార్డులు ప్రైవేటు పాఠశాల విద్యార్థులే దక్కించుకున్నారు.



ఆరుగొలనులో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న బేతా శేషుకుమార్

## మహిళల ఆరోగ్యంపై అవగాహన

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** మహిళల్లో వయస్సుతో పాటు శరీరంలో హార్మోన్ల ప్రభావం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు వస్తుంటాయని అవగాహనతో కూడిన జాగ్రత్తలు పాటించడం అవసరమని డాక్టర్ యలమంచిలి శ్రీరోజా సూచించారు. ఆరుగొలనులో ఆదివారం పెలికాన్ హాస్పిటల్స్, గుడివాడ వారి సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఆరుగొలనుతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల్లోని మహిళలకు, గర్భిణులకు ప్రత్యేకంగా గైనిక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 53మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యశిబిరాన్ని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతా శేషుకుమార్, కార్యదర్శి అన్నే అనిల్‌కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మల బ్రహ్మాజీ తదితరులు పర్యవేక్షించారు.

## యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

**హనుమాన్‌జంక్షన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** యోగ సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ప్రతి ఒక్కరు ఆచరించినపుడే అది సాధ్యం అవుతుందని విశ్రాంతి అధ్యాపకుడు డీవీ రమణ తెలిపారు. యోగాంధ్ర 2025 పిలుపులో భాగంగా జంక్షన్ పట్టణ కూటమి నాయకుల ఆధ్వర్యంలో యోగ శిక్షణా కార్యక్రమం ఆదివారం విజయవాడ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆవరణ పై భాగంలో ప్రారంభించారు. యోగ సాధనపై రమణ అవగాహన కల్పించారు. 21 వరకు యోగా ట్రైనర్ ఎస్.రామకృష్ణ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



ఉయ్యూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో యోగాభ్యాసన

## యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

**ఉయ్యూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** యోగభ్యాసన ద్వారా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువులు జి.కృష్ణ, డి.రాధాకృష్ణ అన్నారు. యోగాంధ్రలో భాగంగా ఉయ్యూరు నగరపంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల మైదానంలో యోగాభ్యాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు మెడిటేషన్, ప్రాణాయామం, ఇతర ఆసనాలు చేయించారు. ప్రతిరోజు యోగాకు కొంత సమయం కేటాయించడం దైనందిన కార్యక్రమంలో అలవాటుగా చేసుకోవాలన్నారు. నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ ఉషారాణి, యోగా ఇన్‌స్పెక్టర్ ఎస్. కన్యాకుమారి, ఎం. శ్రీనివాసరావు, కాళిదాస్, శివ, శ్రీనివాసరావు, కుటుంబరాజు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, రాంబాబు, తిరుమలరావు, రాము పాల్గొన్నారు.

## వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



**ఉంగుటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని వెన్నూతలలో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచి భక్తుల సందడితో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆగమపండితుల వేదమంత్రాల ఘోషతో, జై శ్రీరామ్, జై హనుమాన్ అనే నామంతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. వేదపండితులు మామిళ్ల పల్లి నాగసుబ్బారావుశర్మ, శిష్యబృందం నేతృత్వంలో ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, ప్రత్యేకపూజలు, నిత్యహోమములు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మహాకుంభాభిషేకం జరిపారు. విగ్రహదాత శిష్టా కామేశ్వరమ్మ దంపతులు కుటుంబసమేతంగా స్వామివారికి తమలపాకు పూజలు, హోమక్రతువులు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో పరిసరగ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయకమిటీ పెద్దలు అంగడాల హనుమంతరావు, దిమ్మిటి ప్రసాదరావు, నున్న సాంబశివరావు, నర్ని వెంకటేశ్వరరావు, గోళ్ల శ్రీనివాసరావు, కొలుసు వెంకటేశ్వరరావు, నాగసబోయిన రాము, దిమ్మిటి సాంబశివరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# అమరావతి మహిళలను కించపర్చడం దుర్మార్గం

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నేత సుంకర పద్మశ్రీ**

**ఉంగుటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** రాజధాని అమరావతి ప్రాంత మహిళలను అభ్యంతరకర వ్యాఖ్యలతో అవమానించడం దుర్మార్గమని, జగన్ టీవీ జర్నలిస్టులను తక్షణమే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నేత సుంకర పద్మశ్రీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజధాని మహిళలను కించపరిచేలా మాట్లాడిన వారిని అరెస్ట్ చేయకుండా జాప్యం చేస్తుండటంపై ప్రభుత్వం చేతగానితనం స్పష్టంగా కనిపిస్తోందని ఆమె ఎద్దేవా చేశారు. మహిళలకు జరిగిన అవమానంపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు పెల్లుబుకుతుంటే రాష్ట్ర హోంమంత్రి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అమరావతి మహిళల క్యారెక్టర్‌ను అపహాస్యం చేసిన వారిని అరెస్ట్‌చేయలేకపోతే రాష్ట్రంలోని మహిళలకు మీరేం న్యాయం చేయగలరని హోంమంత్రి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌ను నిలదీశారు.

**పెనమలూరు :** ఇటీవల జగన్ ఛానెల్‌లో యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్లేషకులుగా కృష్ణంరాజు కలిసి డిబేట్ చేసి అమరావతి రాజధానిని వేశ్యల రాజధానిగా అభివర్ణిస్తూ మాట్లాడిన మాటలకు నిరసనగా ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర ఆధ్వర్యంలో తెలుగు మహిళలు జగన్ పత్రిక ప్రతులను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ, రాజధాని మహిళలను నీచంగా మాట్లాడిన వాళ్ల తాట వలుస్తామని హెచ్చరించారు. తన అవినీతి ఛానెల్, పత్రికల్లో మహిళలపై అసభ్యకరమయిన డిబేట్లు పెట్టి అమరావతిపై విషం చిమ్ముతున్నారన్నారు. తక్షణమే టీడీపీ కూటమి ప్రభుత్వం కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై కేసులు పెట్టి అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పెనమలూరు పోలీసుస్టేషన్‌లో వారిరువురిపై సీఐ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బొప్పన నీరజ, లావణ్య, మల్లంపాటి విజయలక్ష్మి, మేడసాని రత్నకుమారి, దండమూడి సాయిసుధ, గట్టు వాణి, శేషకుమారి, పండల రజిని, జనసేన వీరమహిళలు లక్ష్మీ సరస్వతి, పాలడుగు మధుమిత, ఎం కళ్యాణి, మేకా స్వాతి తేజ తదితరులు పాల్గొన్నారు.



జగన్ పత్రిక ప్రతులను తగలబెడుతున్న తెలుగు మహిళలు, వీర మహిళలు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** మహిళల గురించి నీచమైన భాషతో వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి అన్నారు. ఆడబిడ్డలను గౌరవించలేని వారికి సమాజంలో జీవించే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

● రాష్ట్రాభివృద్ధి కోసం భూములను త్యాగం చేసిన రైతు కుటుంబాల్లోని మహిళలను నీచమైన భాషతో వ్యాఖ్యానించడం అమానుషమని, ప్రజా రాజధాని అమరావతిపై విషం చిమ్మేందుకు వైసీపీ అడుతున్న వికృత క్రీడని అమరావతి రైతు జేఏసీ నాయకుడు ఆళ్ల గోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అమరావతి రైతులను చిత్రహింసలకు గురిచేసినా శాంతియుతంగా నిరసన చేపట్టిన సంగతి గుర్తు చేశారు. అమరావతి పనులు వేగం పుంజుకుంటున్న తరుణంలో కావాలనే విషం చిమ్ముతున్నారన్నారు.

● జర్నలిస్టుల ముసుగులో ఆంధ్రుల రాజధాని అమరావతిలోని మహిళలను అవమానించిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులు తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని జర్నలిస్ట్ నాయకుడు అట్లూరి రాజశేఖర్ డిమాండ్ చేశారు. వారు చేసిన వ్యాఖ్యలు జర్నలిస్టులకు పాత్రికేయవృత్తికే కళంకం తెచ్చేలా ఉన్నాయని మండి పడ్డారు.

**ఉయ్యూరు :** అమరావతి మహిళల పట్ల జగన్ చానల్‌లో సభ్యసమాజం తలదించుకునే విధంగా అవమానకరంగా కించపరచడాన్ని టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు చేదుర్తిపాటి ప్రవీణ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, జగన్ మీడియాలో మహిళలను కించప రిచే విధంగా మాట్లాడిన కృష్ణంరాజును డిబేట్ పెట్టిన కొమ్మినేని శ్రీనివాసరావులను వెంటనే అరెస్టు చేయా లని డిమాండ్ చేశారు. రాజధానికి భూములిచ్చిన వారిలో 75 శాతం వరకు బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, బీసీ, మైనారిటీ రైతులే అని జగన్ మీడియా లో చేసి న వ్యాఖ్యలు ఆయా వర్గాలను కించపరచడమేనన్నారు.

# ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు!

- వేసిన రెండు నెలలకే కోతకు గురైన రోడ్డు, పోసేముందు ఇసుక బస్తాలు వేసి పూడ్చిన గుంతలు

**(ఉయ్యూరు- ఆంధ్రజ్యోతి)**

సాయిపురం - ముదునూరు రోడ్డులో చంద్రయ్య కోడు వంతెన అప్రోచ్ రోడ్డు వేసిన రెండు నెలలకే కోతకు గురై ప్రమాదకర పరిస్థితికి చేరుకుంది. సాయిపురం నుంచి ముదునూరు వేళ్లే రోడ్డు సంవత్సరాల తరబడి అభివృద్ధికి నోచుకోక గుంతలమయంగా తయారై ద్విచక్రవాహనాలు సైతం వెళ్లే వీలులేక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించగా రెండు నెలల క్రితం రోడ్డు అభివృద్ధి పనులు చేశారు. ఈ రోడ్డులో ఉన్న చంద్రయ్యకోడు వంతెనకు అప్రోచ్ వద్ద పెద్ద అగాధాలు ఏర్పడగా వాటిని పూడ్చేందుకు ఇరువైపులా ఇసుక బస్తాలువేసి దానిపైన మెటల్‌వేసి రోడ్డు పనులు చేశారు. వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్డుకు రిటైనింగ్ వాల్ లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై మట్టికొట్టుకుపోయి ఇసుక బస్తాలు కుంగి మట్టి, రోడ్డు కొట్టుకు పోయి ఆప్రాంతంలో పెద్ద అగాథం ఏర్పడింది. వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్లకు రిటైనింగ్‌వాల్ నిర్మించకపోవడంతో వర్షాలకు, కాల్వలో నీరు పెరిగినప్పుడు మట్టి కోతకు గురవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



చంద్రయ్య కోడు వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్‌బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 234 |
| చికెన్ స్కిన్‌లెస్ | 244 |



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

## కొండాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

**గుడ్లవల్లేరు, 8 (ఆంధ్రజ్యోతి) :** వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. మండే ఎండల్లో సైతం అమ్మవారిని 25,000 మంది భక్తులు ఈ ఆదివారం దర్శించుకోవడం విశేషం. దేవస్థానం వారిచే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు ఏర్పాటు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.



కొండాలమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

# విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**గుడివాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** నియోజకవర్గవ్యాప్తంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం స్థానిక ప్రజావేదికలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో ఎమ్మెల్యే సూచించిన పనుల తాలుకు ప్రతిపాదనల నివేదికలను అధికారులు ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టిడ్కో కాలనీ నుంచి కొతవరం సబ్ స్టేషన్ వరకు 13కిలోమీటర్ల మేర రూ.2.20కోట్లతో 33 కేవీ నూతన విద్యుత్ లైన్ నిర్మాణం పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. నందివాడలోని కొన్ని గ్రామాల్లో అధికంగా విద్యుత్ సమస్యలున్నాయన్నారు. నందివాడ నుంచి పెదవిరివాడ వరకు సుమారు 10కిలోమీటర్ల మేర 33కేవీ నూతన విద్యుత్ లైను ఏర్పాటుకు రూ.1.50కోట్లు, పుట్టగుంట- నందివాడ మధ్య 10కిలోమీటర్ల మేర 33 కేవీ నూతన విద్యుత్ లైను ఏర్పాటకు రూ.1.50కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. పోలుకొండ పరిసర ప్రాంతాల్లో 11 కేవీ లైన్ల మరమ్మతులు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, సబ్ స్టేషన్‌లలో బ్రేకర్ల ఏర్పాటుకు రూ.1కోటితో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. పట్టణంలో అవసరమైన నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు మరమ్మతులకు రూ.1కోటితో ప్రతిపాదనలు రూపొందించినట్టు తెలిపారు. అంగలూరు, డోకిపర్రు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు, సబ్ స్టేషన్‌లలో బ్రేకర్ల ఏర్పాటుకు రూ.20లక్షలతో ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి శ్రీనివాసరావు, ఏడీలు మాణిక్యవర్మ, కిరణ్, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



దీక్షా వస్త్రాలను అందజేస్తున్న వేణుగోపాలరావు

## వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**గుడివాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం కుంభారాధన లక్ష్మీనారాయణ యాగం, శ్రీస్వామివారికి 108 కలశాలతో పంచామృత అభిషేకములను కృష్ణకిషోర్, లక్ష్మీసౌజన్య దంపతులు నిర్వహించారు. దేవస్థానం తరుపున ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు దీక్షా వస్త్రాలను అందజేశారు. సాయంత్రం శేషవాహనంపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి భవాని శశాంక్ , ఊహ దంపతులు రాయబారోత్సవం నిర్వహించారు.



యోగాసనాలు వేస్తున్న సైక్లింగ్, వాకర్స్ సభ్యులు

## యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

**గుడివాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** స్థానిక ఐఎంఏ హాల్‌లో ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. మాస్టర్ ట్రైనర్ లీలావతి, శ్రీనివాస్‌లు యోగాసనాలు వేయించారు. ఐఎంఏ గుడివాడ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ మానసిక దృఢత్వంతో కూడిన ఆరోగ్యకర జీవనశైలి ప్రజల్లో అలవాటు కావాలన్నారు. జూన్ 12వ తేదీ వరకు ఐఎంఏ హాల్‌లో యోగాశిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఆయూష్ శాఖ జిల్లా అధికారి డాక్టర్ నాగేంద్ర, రెడ్డి లక్ష్మీ, డాక్టర్ రవినాథ్, ఐఎంఏ సభ్యులు జయప్రకాష్ నారాయణ, శివప్రసాద్, సూరజ్, శ్రావణి, అనూషలు, గుడివాడ సైక్లింగ్ సభ్యులు , వాకర్స్ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడు బోలెం తాతయ్య మృతి

**పమిడిముక్కల :** పమిడిముక్కల మండల టీడీపీ క్లస్టర్ హెడ్, గ్రామపార్టీ వార్డు సభ్యుడు బోలెం లక్ష్మీనారాయణ(తాతయ్య(40) ఆదివారం గుడెపోటుతో మృతిచెందారు. సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో పార్టీ విజయానికి విశేష కృషిచేసిన తాతయ్య అకాల మృతి పట్ల ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తీవ్ర సంతాపం తెలియచేసి ఘన నివాళులర్పించారు. తాతయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.



బోలెం తాతయ్య

# చలో మంగళగిరిని విజయవంతం చేయాలి

● శీలం నారాయణరావు

**కూచిపూడి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో కౌలు దారులకు అన్నదాత సుఖీభవ రూ.20 వేలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11న మంగళగిరిలో ఉన్న రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మొవ్వ మండలం కాజ గ్రామంలో ఆదివారం సాయంత్రం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యజమాని సంతకం లేకుండా గ్రామ సభ ద్వారా కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కాజ కౌలు రైతులు కొడాలి కరుణాకర్, మట్టా జాన్, ఇంటూరు జైపాల్, యల్లమల్లి సురేంద్ర, నాగయ్య, మట్టా సామేరు, మట్టా నాంచారయ్య, ఎల్లమిల్లి గోపిచంద్, వెంకటేశ్వరరావు తదిరతులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరించిన కౌలు సంఘం నేతలు



వైశాలి



మహాశివరాణి



నిఖిత సాయి



అన్విత జాయ్



సాయి యశ్వంత్



తేజస్విని



లాస్య సాయి

# షైనింగ్ స్టార్స్-2025 అవార్డులకు ఏడుగురు ఎంపిక

**కూచిపూడి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో మొవ్వ మండలం నుంచి ప్రతిభ కనబర్చిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ - 2025 అవార్డులకు ఎంపికైనట్టు ఎంఈవో ఎస్.శివశంకరరావు తెలిపారు. వీరికి మచిలీపట్నం జడ్పీ కన్వెన్షన్ హాలులో సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే అభినందన సభలో నగదు పురస్కారంతోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించి సత్కరించనున్నట్టు తెలిపారు. ఈ అవార్డుకు ఎంపికైన వారిలో తిరుమలశెట్టి నిఖిత సాయి, లాస్యసాయి, రాయల మహాశివరాణి, వక్కలగడ్డ తేజస్విని, పామర్తి వెంకట సాయి యశ్వంత్, అన్విత జాయ్, కూతాడిలు ఉన్నారు.

# ఆలయాల జీర్ణోద్ధరణ కమిటీకి విరాళాలు

**గుడ్లవల్లేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** గుడ్లవల్లేరు రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ గోపుర జీర్ణోద్ధరణ, గంగానమ్మ తల్లి ఆలయం జీర్ణోద్ధరణ పునఃనిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ వారి తనయుడు అమిత్ కుమార్(యుఎస్‌ఏ) చేతులమీదుగా పొట్లూరి వెంకట్రావు, విజయలక్ష్మీ దంపతుల, అమిత్‌కుమార్, హరికీర్తి(యుఎస్‌ఏ) దంపతులు రూ. 40332ల విరాళాన్ని జీర్ణోద్ధరణ కమిటీకి అందజేశారు. అలానే చాపరాల రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం వారి సతీమణి చాపరాల తనూజ, చాపరాల శివప్రసాద్, హర్షిత దంపతులు రూ.20232 లు పోలవరపు వెంకటరావు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో వల్లభనేని వెంకట్రావు, వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, యెనిగళ్ల నాగేశ్వరరావు, వల్లూరుపల్లి వెంకటేశ్వరరావు, చాపరాల సుధాకర్, మురాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు అందజేస్తున్న పొట్లూరి రవి, అమిత్

# విద్యుత్ స్మార్ట్‌మీటర్ల నిర్ణయం దారుణం

● ఆర్‌సీపీ రెడ్డి

**గుడివాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు బాదుడే బాదుడు పేరుతో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టిందని, నేడు స్మార్ట్‌మీటర్లను బిగించాలని నిర్ణయించడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి ఆరోపించారు. ఆదివారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లిలో స్మార్ట్‌మీటర్‌లను బిగిస్తుంటే ప్రజల నుంచి నిరసనలు రావడంతో మీటర్లు బిగించడం నిలిపివేశారన్నారు. స్మార్ట్‌మీటర్ల బిగించడాన్ని సీపీఎం పూర్తిగా వ్యతిరేకిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

## వైభవంగా బోలెం, బాసంశెట్టి వారి దేవరల సంబరాలు

**తోట్లవల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** యాకమూరులో ఆదివారం బోలెం వారి అంకమ్మతల్లి జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. 5వ తేదీన అమ్మవారికి శిఖర ప్రతిష్ఠతో మొదలైన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బోలెం వంశీకులు భారీగా యాకమూరు తరలి వచ్చి అంకమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే గుర్విందపల్లిలో బాసంశెట్టి వారి దేవర ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పలువురు టీడీపీ నాయకులు ఈ ఉత్సవానికి హాజరయ్యారు.



బోలెం వారి అంకమ్మతల్లి

# ఉపాధ్యాయ బదిలీలపై విద్యాశాఖ మొండిపట్టు వీడాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఇమ్మానియేలు, చంద్రశేఖర్

**గుడివాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్ కౌన్సిలింగ్ బదులు మ్యాన్యువల్‌గా కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని ఉపాధ్యాయ సంఘాలకు విద్యాశాఖ సంచాలకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఇమ్మానియేలు, డి.చంద్రశేఖర్‌లు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏకంగా విద్యాశాఖ సంచాలకులు ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తూ కిందిస్థాయి విద్యాశాఖ అధికారులచే వెబ్ ఆప్షన్లను నమోదు చేయాల్సిందిగా ఎస్.జి.టిలపై బలవంతంగా ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీ కోసం వేలాది ఆప్షన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేమని, దీనికి బదులుగా డీఈవో కార్యాలయాల్లో మ్యానువల్‌గా కౌన్సిలింగ్ నిర్వహించాలని ఎంత మొత్తుకున్న విద్యాశాఖ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉపాధ్యాయులందరూ రోడ్డెక్కి డీఈవో కార్యాలయాల ముట్టడి చేస్తూ ఆందోళనలు చేస్తున్నా, విద్యాశాఖ మంత్రి నుంచి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. తక్షణమే ఉపాధ్యాయ సంఘాల సమావేశం నిర్వహించి ఎస్.జి.టి ఉపాధ్యాయులకు మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని వారు కోరారు.

## సమగ్ర దర్యాప్తుకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

**గుడివాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** తమ ఇళ్లకు స్మార్ట్‌మీటర్లను బిగించడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమ నాయకుడు బి.వి.శ్రీనివాసరావు స్మార్ట్‌మీటర్‌లను లాగి పగలకొట్టగా, శ్రీకాళహస్తి కాలనీ, టిడ్కో కాలనీ, మందపాడు న్యూ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ధర్నాలు నిర్వహించిన విషయం విదితమే.. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి క్షేత్రస్థాయిలో స్మార్ట్‌మీటర్ల పనితీరు ఎలా ఉంది, విద్యుత్ ఛార్జీలు అధికంగా రావడం వాస్తవమా కాదా అనే విషయాలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు.

## బంగారు హారాలు బహూకరణ

**కూచిపూడి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):** కూచిపూడిలోని బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారికి ప్రముఖ నాట్యాచార్యులు పసుమర్తి రామలింగ శాస్త్రి - పద్మ దంపతులు రూ.8 లక్షల విలువ గల బంగారు హారాలను ఆలయ పాలక మండలి ఉపాధ్యక్షుడు పసుమర్తి నారాయణ మూర్తి, అర్చకులు పెనుమూడి సుబ్రహ్మణ్య శాస్త్రి చేతులమీదుగా అందజేశారు. అలాగే దాసాంజనేయస్వామివారికి 108 వెండి తమలపాకులమాలను అందజేశారు. ఈ సందర్భంగా హారాలను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఐదు కాసుల బంగారం చోరీ

**గుడివాడ, జూన్ 8(ఆంధ్రజ్యోతి) :** స్థానిక తుమ్మలపల్లి వారి వీధికి చెందిన తమ్మన వీర వెంకట అయ్యప్ప, అతని కుటుంబసభ్యులు 7వ తేదీన మచిలీపట్నంలో వివాహానికి వెళ్లి, 8వ తేదీ ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ఇంటి వెనుక ద్వారం పగలకొట్టి, బీరువా తాళాన్ని పెకలించి దానిలోని 5కాసుల బంగారం, రూ2వేలు నగదు ఎత్తుకుపోయినట్టు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఏఎస్సై జయబాబు తెలిపారు.

## మహిళలకు కుట్టుమిషన్లు అందజేత

**గుడివాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో పాస్టర్ డేవిడ్ రాజు వితరణతో 5గురు పేద మహిళలకు కుట్టు మిషన్‌లను ఆదివారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు వెనిగండ్ల రామకృష్ణ(నాని) అందజేశారు. పాస్టర్ డేవిడ్‌రాజు ఆలోచన ఆదర్శప్రాయమని, ఆయనచేసిన సహాయాన్ని నాని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడ్కోకాలనీ ఇన్‌చార్జ్ నిరంజన్, స్థానికులు పాల్గొన్నారు.

# ఉచిత మధుమేహ వైద్య శిబిరం

**గుడ్లవల్లేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఆదివారం మధుమేహవ్యాధికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. గుడివాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గవిర్నేని రజని వైద్యపరీక్షలు నిర్వహించారు. శిబిరానికి డాక్టర్ నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), వల్లభనేని రామకృష్ణ(యుఎస్‌ఏ), కొసరాజు బాపయ్య చౌదరిలు దాతలుగా వ్యవహరించారు. రోగులకు 15 రోజులకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైవీసీ ప్రసాద్, శిబిర కోఆర్డినేటర్ మూల్పూరి సుధాకర్, జంగం మోహనరావు, చాపరాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రజని



ఆర్థికసాయం అందజేస్తున్న జనసేన నాయకులు

## ఆర్థిక సాయం

**గుడ్లవల్లేరు, 8 (ఆంధ్రజ్యోతి) :** కూరాడ లాకుదిగువ ప్రాంతానికి చెందిన పేద లారీడ్రైవర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా వారి కుమార్తె గాయిత్రికి చదువు నిమిత్తం గుడ్లవల్లేరు జనసేన పార్టీ తరపున రూ. 10000లు ఆర్థిక సహాయాన్ని ఆదివారం జనసేన నాయకులు అంద జేశారు. విద్యార్థిని గాయిత్రి చక్కగా విద్యనభ్యసించి రాణించాలని జనసేన నాయకులు ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో చిలంకుర్తి వెంకట్(వెంకి), ననకా వెంకట్రామయ్య(నాని) తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు

**గుడివాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** గంజాయి అక్రమ రవాణను అరికట్టేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని విజయవాడ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రత్నరాజు పేర్కొన్నారు. రాష్ట్ర రైల్వే డీఐజీ సత్యఏసుబాబు, విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్‌ల ఉత్తర్వుల ప్రకారం ఆదివారం గుడివాడ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. రైల్వే ప్లాట్‌పారమ్‌లు, వెయిటింగ్ హాల్స్, బుకింగ్ ఆఫీసులు, రైల్వే కోచ్, పార్సెల్ ఆఫీసుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రైల్వే ఎస్సై ఎంవీ దుర్గారావు, సిబ్బంది, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగవు

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

**పామర్రు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) :** ప్రజా రాజధాని అమరావతినేకాదని రాష్ట్రంలోని ఆడపడుచులందరినీ ఘోరంగా అవమానించేలా వైసీపీ అధినేత జగన్ అండ్ కోకు తగదని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజాసామ్య విలువలు అపహస్యం చేసే రీతిలో ఆడబిడ్డల మనోభావాలు దెబ్బతినే విధంగా జర్నలిస్టు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్‌లు చేసిన వాఖ్యలపై తక్షణమే క్షమాపణ లు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళల ఆగ్రహావేశాలకు గురికాక తప్పదని హెచ్చరించారు. ఇది ఇలా ఉండగా రాజధాని అమరావతిపై అనుచిత వాఖ్యలు చేసిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా టీడీపీ తెలుగు మహిళా నేత షైనేని ఇందిర పమిడి ముక్కల పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆమె వివరించారు.

**గుడివాడ :** అమరావతి మహిళలను కించపరిచే విధంగా డిబేట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజు, జగన్ పత్రిక యాజమాన్యంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రజావేదిక వద్ద జగన్ పత్రిక ప్రతులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజధాని మహిళలను అవమానిస్తే కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమన్నారు. తక్షణమే యావత్ మహిళ లోకానికి భారతి రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుగు మహిళలు గొర్ల శ్రీలక్ష్మీ, పొట్లూరి రమాదేవి, మాదాల సునీత, వీరమాచినేని శైలజ, పాల్గొన్నారు.



గుడివాడలో నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 234 |
| చికెన్ స్కిన్‌లెస్ | 244 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

## వాసవీ వృద్ధాశ్రమం అధ్యక్షుడిగా నటరాజశేఖర్ ఏకగ్రీవం



మచిలీపట్నం టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీవాసవీ వృద్ధాశ్రమం అధ్యక్షులుగా పులవర్తి నటరాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా దోరడ్ల హేమప్రకాష్ వ్యవహరించారు. తాడేపల్లి మల్లికార్జునరావు, ఉడత్తు శ్రీనివాసరావు, పూర్వ ఉపాధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. సభ్యులు సన్నిధి నాగసాయి శ్రీనివాస్, ఎస్.వి.ఎల్. కాంతారావు, కె.జి.కె. మూర్తి, పులవర్తి శ్రీనివాస్, పద్మనాభుని శేఖర్ పాల్గొన్నారు.



సినీనటుడు సత్యప్రకాష్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో

## సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ఒక్కరోజే అధిక సంఖ్యలో భక్తులు రావటంతో రూ.10,25,530 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ప్రముఖ సినీ నటుడు సత్యప్రకాష్ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందించారు.

## యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న డీఆర్వో కె.చంద్రశేఖర్‌రావు

మచిలీపట్నం టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని డీఆర్వో కె.చంద్రశేఖరరావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో సీనియర్ సిటిజన్లకు యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. డీఆర్వో కె.చంద్రశేఖర్, మచిలీపట్నం మున్సిపల్ కమీషనర్ బాపిరాజు సీనియర్ సిటిజన్లతో యోగా సాధన చేయించారు. యోగా గురువులు పోతురాజు శాస్త్రి, ఘంటసాల గురునాథబాబు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయుష్ అధికారి వాహిని పర్యవేక్షించారు. యోగా గురువులు మద్దాల చింతయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.



కళాకారుడు బోలెం రామారావును సన్మానిస్తున్న ప్రముఖులు

## ఆకట్టుకున్న దుర్యోధన మయసభ



చల్లపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులో జానపద, పౌరాణిక నాటక ప్రదర్శనలు ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు ముమ్మనేని నాని.. మల్లీశ్వరి దంపతులు జ్యోతి వెలిగించి ప్రదర్శనలు ప్రారంభించారు. తొలుత కోలాట ప్రదర్శన, కూచిపూడి నాట్యప్రదర్శన, బాల దుర్యోధనుడుగా బొల్లా నిర్దేష్ సాయి ప్రదర్శన జరిగింది. ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావు దుర్యోధన మయసభ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. రామభక్త హనుమాన్ నాటకం నుంచీ ఆంజనేయుని యుద్ధసీను ప్రదర్శన జరుగ్గా, ఆంజనేయునిగా సినీ, టివి, స్టేజి ఆర్టిస్టు పస్తుల విజయకుమార్, గరుత్మంనిగా బొడ్డు రంగారావు అద్భుతంగా ప్రదర్శించారు. పౌరాణిక వైభవాన్ని చాటిచెప్పేలా నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్న బోలెం రామారావును సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సజ్జా చలపతిరావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, యాసం చిట్టిబాబు, ఆకుల స్వభూప్రసాద్, గుడివాక శివరావు, రావెళ్ల ఉదయ్ కుమార్, వేమూరి రత్నగిరిరావు, అడపా రాంబాబు, షేక్ నబీషెరీ, కైతేపల్లి దాస్, బుల్లా కిషోర్ తదితరులు సన్మానించారు. కళాపరిషత్ ప్రతినిధులు ముమ్మనేని నాని, దాసి సీతారామరాజు, బోలెం నాగమణి, ఉప్పాల సాంబశివరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మసులా బీచ్ ఫెస్టివల్ చివరి రోజు ఆదివారం పర్యాటకుల రద్దీ



సాంస్కృతిక ప్రదర్శనల్లో గుడివాడ కళాకారుల నృత్యం

# మసులా బీచ్ ఫెస్టివల్ అదుర్స్

మచిలీపట్నం టౌన్/కృత్తివెన్ను జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మంత్రి కొల్లు రవీంద్ర నేతృత్వంలో ఈనెల 5వ తేదీ నుంచి ఆదివారం వరకు నాలుగురోజుల పాటు జరిగిన మసులా బీచ్ ఫెస్టివల్ అందరి మదిలో మంచి అనుభూతులను మిగిల్చింది. దాదాపు 10 లక్షల మంది పర్యాటకులు పిల్లా పాపలతో హాజరై కేరింతలు కొట్టి ఎంతో ఆనందించారు. మండుటెండల్లో బీచ్‌లో స్నానాలు చేసి సేదతీరడంతో పాటు హార్స్ రైడింగ్, బోట్ రైడింగ్, పారా గ్లైడింగ్, హెలికాప్టర్ విహారంతో ఎంతో ఎంజాయ్ చేశారు. మసులా బీచ్ ఫెస్టివల్ ప్రాంగణంలోకి రావడంతోనే మరో లోకంలోకి వచ్చామనే భావన కలిగిందని పర్యాటలు చెప్పడం గమనార్హం. బీచ్ ఫెస్టివల్‌లో సంప్రదాయ కళలకు పెద్దపీట వేశారు. కోలాట ప్రదర్శనలు, డప్పు కళాకారుల ప్రదర్శనలతో బీచ్ హోరెత్తింది. లక్షలాది ప్రేక్షకులను కూచిపూడి నాట్య ప్రదర్శనలు, సినీ కళాకారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కొరియోగ్రాఫర్స్ రాజు, వినీత్‌ల డ్యాన్స్ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సింగర్ మిరియాల రామ్ తన గానంతో ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. ఎందరో ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, సినీ యాక్టర్లు, వివిధ రంగాల్లోని ప్రముఖులు రాష్ట్ర నలుమూలాల నుంచి హాజరయ్యారు. ప్రముఖులను మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేకంగా సన్మానించారు. కలంకారీ శాలువాలు, కొండపల్లి బొమ్మలను ప్రత్యేకంగా బహుకరించారు.



### కళ్లకు కట్టినట్టుగా పహల్గాం దాడి

మసులా బీచ్ ఫెస్టివల్ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పహల్గాం దాడి దాడిని కళ్లకు కట్టినట్టుగా కళాకారులు ప్రదర్శించారు. జరిగిన ఆపరేషన్ సింధూర్‌ను కూడ ప్రదర్శించగా, యువత భావోద్వేగానికి గురయ్యారు.



### పర్యాటకం పరుగులు : రవీంద్ర, అనగాని

వైసీపీ పాలనలో వెనక్కి వెళ్లిన పర్యాటక రంగాన్ని కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే అభివృద్ధిపథంలో పరుగులు పెట్టించిందని మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం రాత్రి బీచ్ ఫెస్టివల్ ముగింపు సభలో సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర మాట్లాడారు. అనగాని మాట్లాడుతూ, పులికాట్‌లో ఫ్లెమింగో ఫెస్టివల్, మంగినపూడిలో మసులా ఫెస్టివల్ నిర్వహించామన్నారు.

కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించటం ఆదర్శనీయమన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, బీచ్ ఫెస్టివల్‌తో జన సునామీ వచ్చిందన్నారు. దేశంలో ఏ బీచ్‌లోను ఇలాంటి ఫెస్టివల్ జరగలేదన్నారు. రేపల్లి - మచిలీపట్నం రైల్వే మార్గం పూర్తి చేస్తే, మచిలీపట్నం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బందరు పోర్టు నిర్మాణాన్ని 2026 డిసెంబరుకు పూర్తి చేస్తామన్నారు. ప్రజలు ఇచ్చిన పునర్జన్మతో తిరిగి బందరులో ప్రజాసేవలోనున్నామన్నారు. చివరి రక్తపు బొట్టు వరకు బందరు అభివృద్ధికి కృషి చేస్తాననన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, వీరంకి గురుమూర్తి పాల్గొన్నారు.



### త్రిముఖ చిత్రం యూనిట్ సందడి

మచిలీపట్నం టౌన్ : త్రిముఖ సినిమాను పాన్ ఇండియా చిత్రం స్థాయిలో నిర్మాణం చేశామని త్రిముఖ సినిమా హీరో యోగేష్ అన్నారు. మసులా బీచ్ ఫెస్టివల్‌లో త్రిముఖ చిత్ర బృందం సభ్యులు ఆదివారం సందడి చేశారు. బందరుకు చెందిన హీరో యోగేష్ మాట్లాడుతూ, తాను పుట్టి పెరిగిన మచిలీపట్నంలో సినిమా ప్రమోషన్ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. హీరోయిన్‌లు ఆకృతి అగర్వాల్, సాహితి, డైరెక్టర్ రాజేష్, చిత్రం శ్రీను, జూనియర్ రాజశేఖర్ (గబ్బర్‌సింగ్ ఫేమ్), నిర్మాతలు రమేష్, శ్రీదేవి మద్దాలి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి వేశ్యల రాజధాని వ్యాఖ్యలపై ఆగ్రహావేశాలు

- అవనిగడ్డ, కృత్తివెన్నులో కొమ్మినేని, కృష్ణంరాజు చిత్రపటాల దహనం
- ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుకు ఫిర్యాదు





కొమ్మినేని, కృష్ణంరాజు చిత్రాలను చెప్పులతో కొడుతున్న తెలుగు మహిళలు, కృత్తివెన్నులో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

అవనిగడ్డ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి వేశ్యల రాజధాని అంటూ జగన్ చానల్‌లో జరిగిన డిబేట్‌లో కొమ్మినేని, కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, పార్టీ నేత బొబ్బా గోవర్ధన్ నేతృత్వంలో జరిగిన నిరసన కార్యక్రమంలో కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్ చిత్రపటాలను చెప్పులతో కొడుతూ, తహసీల్దార్ కార్యాలయ సమీపంలో దహనం చేశారు. పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా తరలివెళ్లి కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్సీ మహిళా నేతలు కనగాల రాధ, పైడిపాముల స్వప్న, తెలుగు మహిళా నేతలు మోర్ల జయలక్ష్మీ, బావిశెట్టి కనకదుర్గ, నారాయణమ్మ, బండే శ్రీనివాసరావు, రావి రత్నగిరి, మండలి రామ్మోహనరావు, బండే రాఘవ, పరుచూరి దుర్గా ప్రసాద్, షేక్ బాబావలి, మేడికొండ విజయ్, ఘంటసాల రాజమోహనరావుపాల్గొన్నారు.

**కృత్తివెన్ను** : మహిళలను కించపరిచేలా డిబేట్‌లో మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులను అరెస్ట్ చేయాలని కోరుతూ ఆదివారం టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు కృత్తివెన్ను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఒడుగు తులసీరావు, డీసీ నెక్కంటి భాస్కరరావు, నాయకులు కూనసాని శ్రీనివాసరావు, యాదంరెడ్డి కొండ, చేకూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

### ఓర్వలేకే.. : మంత్రులు కొల్లు, అనగాని

**మచిలీపట్నం టౌన్** : అమరావతిపై అసభ్యంగా మాట్లాడితే ప్రజలు సహించరని మంత్రి అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం రాత్రి మంగినపూడిలో వారు విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రుల రాజధాని అమరావతిని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా దేశంలోనే ఉన్నత రాజధానిగా నిర్మిస్తుంటే ఓర్వలేక జగన్ మీడియా, వైసీపీ మూకలు రాజధానిని, మహిళలను కించపరిచేలా వ్యాఖ్యనించటం సరికాదన్నారు. మంత్రులతో పాటు కొనకళ్ల నారాయణరావు, గురుమూర్తి, బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులు

### తాపీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

మోపిదేవి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఐఆర్‌బీ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక విశ్వనాథపల్లి వెంకట నారాయణ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఉత్తర చిరువోలులంకలో జరిగింది. విశ్వనాథపల్లి వెంకట నారాయణ తాపీ పని చేసి జీవనం సాగిస్తుంటాడు. కుటుంబ అవసరాల నిమిత్తం మచిలీపట్నంలోని ఐఆర్‌బీ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వద్ద తన ఇంటిపై రూ.4 లక్షల రుణం తీసుకున్నారు. బ్యాంక్ లావాదేవీలు, డాక్యుమెంటేషన్ ఖర్చుల నిమిత్తం రూ.1.20లక్షలు మినహాయించి మిగిలిన రూ.2.80 లక్షలు ఇచ్చారు. ప్రతి నెలా వాయిదాలు చెల్లిస్తుండగా, ఆర్థిక ఇబ్బందులు కారణంగా రెండు నెలలు వాయిదాలు చెల్లించలేకపోయాడు. శనివారం రాత్రి బ్యాంక్ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి వాయిదాలు చెల్లించని కారణంగా ఇంటిని వేలం వేస్తామని బెదిరించి వెళ్లారు. మనస్తాపానికి గురైన వెంకట నారాయణ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తండ్రి విశ్వనాథపల్లి వేణు ఫిర్యాదు మేరకు మోపిదేవి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జలక్రీడల అకాడమీ పనుల పరిశీలన

నాగాయలంక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జలక్రీడల శిక్షణా కేంద్రం నిర్మాణ లక్ష్యం నెరవేరుతోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నాగాయలంకలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. జలక్రీడల అకాడమీ నిర్మాణం పూర్తి చేయాల్సిన ఆవశ్యకత, ప్రాధాన్యత గుర్తించిన కలెక్టర్ డి.కె.బాలాజీ రూ.2 కోట్లు మంజూరు చేయటంతో లక్ష్యం నెరవేరుతోందన్నారు. పంచాయతీ రాజ్ డీఈఈ పగడాల సురేష్‌బాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వసతిగృహాలను మండలి పరిశీలించారు. రూ.15.50 లక్షలతో బీసీ బాలికల వసతి గృహంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు సకాలంలో అధికారులు బాధ్యతగా పూర్తి చేయాలని సూచించారు.

## మాజేరులో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్

చల్లపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో మాజేరులో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించి కార్యక్రమ ఉద్దేశ్యాన్ని తెలియజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ జి.కృష్ణవేణి, డాక్టర్ సత్యప్రియ లలిత, ఎస్.శ్యామలాదేవి మాట్లాడుతూ, వరిలో నూతన వరి వంగడాలు, యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షలు, పచ్చిరొట్ట పైర్ల సాగు ఆవశ్యకతను గురించి తెలియజేశారు. మండల వ్యవసాయశాఖ అధికారిణి జి.సాయిసింధు, ఉద్యానవన శాఖ అధికారిణి కీర్తిలు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయం, ఉద్యానవన పంటలకు సంబంధించిన వివరాలను రైతులకు తెలిపారు. మాజేరు రైతులు పాల్గొన్నారు.



ఘంటసాలలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడి విగ్రహం



శ్రీరాంపురంలో ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు



టి.కొత్తపాలెంలో ప్రతిష్టిస్తున్న గంగానమ్మ విగ్రహం



కొక్కిలిగడ్డలో ప్రతిష్ఠించిన మహాలక్ష్మమ్మ విగ్రహం

# వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

### ఘంటసాలలో శ్రీకృష్ణుడి విగ్రహం..

ఘంటసాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల బాలాపార్వతీ సమేత జలదీశ్వరస్వామి దేవాలయానికి సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ద్వారకా ఆలయంలో శ్రీకృష్ణపరమాత్ముని విగ్రహ ప్రతిష్ఠ, నూతన శిఖర ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగాయి. బ్రహ్మశ్రీ చావలి దుర్గామల్లికార్జున దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు నిత్యనిధి, గర్తన్యాసం, పీఠన్యాసం, రత్నలోహన్యాసం, ధాతు న్యాసం నిర్వహించి, ఉదయం7.42 నిముషాలకు శిఖర, శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. ఘంటసాలతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న యాదవ సామాజిక వర్గీయులు, గ్రామస్థులు వందలాది మంది ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పంది పిచ్చేశ్వరరావు, కార్యదర్శి వీర్ల రాంబాబు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నాలుగువేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

### శ్రీరాంపురంలో సీతారాముల విగ్రహాలు

**కోడూరు** : ఉల్లిపాలెం గ్రామ శివారు శ్రీరాంపురంలో నిర్మించిన ఆలయంలో సీతారామ లక్ష్మణ హనుమ సహిత గణపతి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఉదయం 7.47 నిముషాలకు వైభవంగా జరిగింది. దేవస్థానం ప్రాంగణంలో భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించగా, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

### టి.కొత్తపాలెంలో గంగానమ్మ విగ్రహం..

**నాగాయలంక** : టి.కొత్తపాలెంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన గంగానమ్మ వాయు ప్రతిష్ఠ ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా గూడూరు రామకృష్ణ శర్మ బృందం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం భారీ అన్నసంతర్పణ జరిగింది. భక్తబృందం, గ్రామస్థులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### కొక్కిలిగడ్డలో మహాలక్ష్మమ్మ విగ్రహం..

**మోపిదేవి** : కొక్కిలిగడ్డలో నిర్మించిన దేవాలయంలో మహాలక్ష్మమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. పూర్ణాహుతి, శీఘ్ర దర్శనం, కళాన్యాసం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాలక్ష్మమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బొబ్బా గోవర్ధన్, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, గ్రామసర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు దిడ్ల రాణీ, చందన రంగారావు, జనసేన ఉమ్మడి కృష్ణా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, మేడికొండ విజయ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



### అవనిగడ్డలో రెడంకమ్మ జాతర

**అవనిగడ్డ** : అవనిగడ్డ తొమ్మిదో వార్డులో పద్మశాలీయుల ఇలవేల్పు ,బట్టువారి కులదైవం రెడంకమ్మ వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. బట్టు నరసింహారావు బ్రహ్మత్వంలో అమ్మవారికి విశేష అలంకరణ చేయగా, బట్టు వారి వంశీయులందరూ భారీగా తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఐదు వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. టీడీపీ కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

### చెరుకుమిల్లిలో ఓంకారేశ్వరస్వామి విగ్రహం...

**కృత్తివెన్ను** : చెరుకుమిల్లి గ్రామంలో అన్నపూర్ణ దేవి సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. స్వామి వారి విగ్రహంతో పాటు వివిధ పరివార దేవతా విగ్రహాలు, ధ్వజస్తంబ, శిఖర ప్రతిష్ఠ జరిపారు. గ్రామ ఆడపడుచులు, భక్తులతో పాటు జిల్లా నలుమూలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం

**అవనిగడ్డ** : వేకనూరులోని శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో స్వామివారి శాంతి కళ్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. రాజశేఖర శర్మ బ్రహ్మత్వంలో మాదివాడ రఘురామ్ - సుజి దంపతులు పీటల మీద ఆసీనులై స్వామివారి కళ్యాణం జరిపించారు. అనంతరం రఘురామ్ ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.